## క్లుప్తంగా

### రక్తహీనత రాకుండా చూడాలి



చిన్న పిల్లల బరువును పరిశీలిస్తున్న డాక్టర్ శాంతి

ఆలూరు రూరల్: ఐదేళ్లలోపు పిల్లలో రక్తహీనత లోపం రాకుండా చూసుకోవాలని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ శాంతి అన్నారు. గురువారం ఆలూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లల్లో జన్యులోపాలు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. పిల్లల ఎదుగుదల, రక్తహీనత లోపం, చెవుల వినికిడి తదితర పరీక్షలు చేస్తున్నామన్నారు.

### పక్కీరప్ప తాత ఉత్సవ విగ్రహం ఊరేగింపు



పక్కీరప్పతాతను ఊరేగింపుగా తెస్తున్న దృశ్యం

మద్దికెర : మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో శ్రావణమాసం గురువారం పురస్కరించుకొని గంగ పూజ అనంతరం అవధూత పక్కీరప్ప తాత ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం దేవాలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

### సచివాలయానికి ప్రింటర్ విరాళం



ప్రింటర్‌ను అందజేస్తున్న రామాంజనేయులు

మద్దికెర : మండల పరిధిలోని ఎం.అగ్రహారం సచివాలయానికి గ్రామానికి చెందిన జోల దరాశి రామాంజనేయులు రూ. 15 వేల ప్రింటర్‌ను విరాళంగా సర్పంచ్ విజయుడు, ఈఓ సంజప్పకు అందజేశారు. ప్రజల సౌకర్యార్థం తనవంతుగా ప్రింటర్‌ను అందజేశానని దాత రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మహేష్‌రెడ్డి, ఎంపీటీసీలు వేణమ్మ, సచివాలయ సిబ్బంది మనోజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రేవప్ప, వలంటీర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన ఈఓఆర్డీ



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈఓఆర్డీ రంగనాయకులు

ఎమ్మిగనూరుటౌన్: గోనెగండ్ల మండలానికి కొత్తగా నియామకమైన ఈఓఆర్డీ రంగనాయకులు గురువారం పట్టణంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కేంద్రమైన నందవరం గ్రామ పంచాయతీ కార్యదర్శిగాను, గోనెగండ్ల ఇన్‌చార్జ్ ఈఓగా పనిచేస్తున్న ఆయన ఈఓఆర్డీగా పదోన్నతిపై గోనెగండ్ల మండలానికి నియమితులయ్యారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.

### లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మసీదపురం గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసమంతా ఈ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. నరసింహస్వామిని దర్శించుకొవడానికి, మన రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేల సంఖ్యలో భక్తులు స్వామి దర్శించి మొక్కులు తీర్చుంటున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాటు చేసినట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు.

### సిటిజన్ సర్వే వేగవంతం చేయండి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ నాగేశ్వర రావు

హొళగుంద: సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే వేగవంతం చేయాలని డీఎల్‌డీఓ నాగేశ్వర రావు సూచించారు. హొళగుందలోని సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం డీఎల్‌డీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా.. ఇంకా ఎవరైనా అర్హులు ఉన్నారా అని సర్వే చేయాలన్నారు. అలాగే హౌసింగ్ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని చెప్పారు. అనంతరం సచివాలయంలో రికార్డులు పరిశీలించారు.

# నారు పోయి నర్సరీలు వచ్చె

- విస్తరిస్తున్న నర్సరీలు
- నారు కోసం నర్సరీలను ఆశ్రయిస్తున్న రైతులు
- మిరప, టమాట మొక్కలకు డిమాండ్



నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు

ఎమ్మిగనూరు: పంటల సాగులో మార్పులొస్తున్నాయి. మోడు వ్యవసాయం కాస్త స్మార్ట్ వ్యవసాయంగా మారుతోంది. ఈ కోవలోనే నారుపోయి వాటి స్థానంలో నర్సరీలు పుట్టుకొచ్చాయి. అవసరం మేరకు పంటనారును సరఫరా చేసే నర్సరీలు వెలుస్తున్నాయి. వీటితో రైతులకు బహుముఖ ప్రయోజనాలు దక్కుతున్నాయి. అదికూడా వ్యవసాయ వ్యాపారంగా విస్తరింస్తోంది.

**తప్పిన ప్రయాసలు**

ఆదోని, పత్తికొండ డివిజన్లలో రైతులు టమాటా, మిరప పంటల సాగు విస్తృతంగా చేపడుతారు. ఒకప్పుడు కూరగాయల పంట సాగుకు రైతులు ఎంతో శ్రమించేవారు. ఇందుకోసం పొలాల్లోనే వారికి కావాల్సిన నారు కోసం విత్తనం చల్లి.. మొక్కలయ్యాక తీసి నాటుకునేవారు. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు నెలరోజులు పట్టేది. కొంత మందికి నీటి కొరత, మరికొంత మందికి విద్యుత్ సమస్య ఉండేది. నారు పెంచేందుకు ఎంతో వ్యవప్రయాసాలకోర్చాల్సి వచ్చేది. అయితే రైతుల్లో కూరగాయలు, వాణిజ్య పంటలసాగుపై మక్కువ పెరగటం, మంచి ధరలు మార్కెట్లో లభిస్తుండటంతో వీటి సాగు విస్తీర్ణం ఏటేటా పెరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో రైతులకు నార్లు సరఫరా చేసేందుకు నర్సరీలు అనేకం పుట్టుకొస్తున్నాయి. పంట కాల వ్యవధి, వ్యయ ప్రయాసలు తగ్గుతాయనే ఉద్దేశంతో రైతులు వీటినే ఆశ్రయిస్తున్నారు.

**టమాట, మిరపకు అధిక డిమాండ్..**

పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో టమాటా పంటను రైతులు విస్తారంగా సాగుచేస్తారు. అదేవిధంగా ఎమ్మిగనూరు, ఆదోని సబ్ డివిజన్‌లలో మిరప సాగు పట్ల రైతులు ఆశక్తి చూపుతున్నారు. ఉమ్మడి ఆదోని డివిజన్‌లో సుమారు 70కుపైగా నర్సరీలు ఉన్నాయి. ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో ఎమ్మిగనూరు, గాజులదిన్నె, హెచ్ మురవణి, కపటి, కోసిగి ప్రాంతాల్లో నర్సరీల్లో మిరపకు అధిక డిమాండ్ ఉంది.

**పంటసాగులో మార్పులు**

పదహారేళ్ల క్రితం నర్సరీల ఊసే ఉండేది కాదు. రైతులే తమ పంట పొలంలో కొంత భాగంలో మిరప నారు చల్లి నెలరోజులపాటు పెంచేవారు. ఆ తరవాత వాటిని పొలం మొత్తంలో బోదెల్లో మొక్కలుగా నాటేవారు. ఒకరైతు పొలంలోనే ఎక్కువ మంది రైతులు మిరపనారు పెంచి తరువాత తీసుకెళ్లి తమ పంట పొలంలో నాటుతునే వారు. కానీ నేడు టమాట, మిరప పంటలతోపాటు వివిధ రకాల కూరగాయల పంటల నారు, పూల నారును నర్సరీల్లో పెంచుతూ రైతులకు అవసరమైన మేరకు విక్రయిస్తున్నారు. రైతుల అవసరాన్ని, మొక్క రకాన్ని బట్టి ధరలు నిర్ణయిస్తూ నర్సరీ యజమానులు వ్యాపారంలో లాభాలు గడిస్తున్నారు.

### సమయం కలిసొస్తుంది



వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటాయో అంచనా వేయటం కష్టమవుతోంది. అందువల్ల ముందస్తుగా పొలంలో నారు పోసుకొంటే అది మొక్కలయ్యేసరికి వర్షాలు వస్తాయో, రావో తెలియదు. వర్షాలు రావడం ఆలస్యమైతే నారు ముదురుపోతుంది. అందువల్ల నర్సరీల్లో అయితే మనకు ఎప్పుడు అవసరమో అప్పుడే నారు కొనుగోలు చేసి పంటసాగు చేయొచ్చు. దీనివల్ల పెట్టుబడి వ్యయం పెరిగినా సమయం కలిసొస్తుంది. అదనులో పంటసాగు జరుగుతోంది.

– షుకూర్, మిర్చిరైతు, ముగతిగ్రామం

### మార్కెట్ ధరలను బట్టి వ్యాపారం



నర్సరీలో మొక్కల విక్రయాలు కూడా ఎప్పుడూ ఒకేలా ఉండవు. మిర్చి, టమాటా ధరలు మార్కెట్లో బాగుంటే రైతులు ఎక్కువ ధరకైనా నారు కొంటారు. అదే మార్కెట్లో ధరలు పడిపోతే పంటసాగు చేసేవారి సంఖ్య తగ్గిపోయి మేము కూడా నష్టపోవాల్సి వస్తుంది. మిరప, టమాటా, వంకాయ నారు అందుబాటులో ఉంచుతున్నాం. వాతావరణం, మార్కెట్ ధరలపైనే నర్సరీల భవిష్యత్తు ఉంటుంది.

– పి రమణ, నర్సరీ యజమాని (గాజులదిన్నె క్రాస్)

### తుంగభద్ర నదిలో మహిళ గల్లంతు



సరస్వతి(ఫైల్)

నందవరం : మండల పరిధిలోని జోహరాపురం గ్రామంలో గురువారం విషాదం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. జోహరాపురం గ్రామానికి చెందిన కురవ బీమేష్ భార్య కురవ సరస్వతి తుంగభద్ర నదిలో బట్టలు ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలి జారీ నీటిలో పడిపోయింది. ఉదయం 11 గంటల సమయంలో సరస్వతి మామ వెంకటప్పకు చెప్పి బట్టలు ఉతకడానికి నదికి వెళ్లింది. మధ్యాహ్నం 3 గంటలైనా తిరిగి రాకపోడంతో వెంకటప్ప తన బంధువువైన రామప్పను నదికి వెళ్లి చూసి రామన్నాడు. దీంతో రామప్ప నదికి వెళ్లి చూడగా బట్టలు మాత్రం నదిలో గుండుపై ఉన్నాయని, సరస్వతి కనిపించడం లేదని తెలిపాడు. దీంతో వెంకటప్ప నదిలోకి వెళ్లి గాలించినా ఆమె కనిపించలేదు. దీంతో గ్రామస్తులకు, పోలీసులకు సమచారం అందించారు. పోలీసులు, గ్రామస్తులు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం 6 గంటల వరకు వెతికినా జాడ కనిపించలేదు. ఎస్ఐ తిమ్మయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. సరస్వతి ఏడు నెలల బాలింతరాలు ఈమెకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

## వినాయక చవితి ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ బి. సీతారామయ్య

ఎమ్మిగనూరురూరల్: సబ్ డివిజన్ పరిధిలో వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మిగనూరు డీఎస్పీ బి. సీతారామయ్య అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలన్నారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే వారు ముందు ఆయా పోలీస్‌స్టేషన్లలో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. ఇది వరకే వినాయక కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి నిబంధనలను వివరించామన్నారు. విగ్రహాల వద్ద కమిటీ సభ్యులు రాత్రి పూట కాపాలగా ఉండాలని, రాత్రి వరకు డీజేలు పెట్టుకొని కాలనీ వాసులకు ఇబ్బందులు కలిగించరాదని సూచించారు. పట్టణంలో ఇప్పటి వరకు 3 రోజులు వేడుకలు జరిగేవని, ఈసారి కమిటీ సభ్యుల వినతి మేరకు 4 రోజులు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి



ఎమ్మిగనూరు గీతామందిర్‌లో చిన్నారులతో ఉట్టి కొట్టిస్తున్న దృశ్యం



మొలగవల్లిలో రథోత్సవం



చిట్యాలలో భక్తుల మధ్య శ్రీకృష్ణుని ఊరేగిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక గీతామందిర్‌లో శ్రీకృష్ణుని వేషాధారణలో చిన్నారులు ఉట్టి కొట్టి అలరించారు. ఆలయంలో ప్రధాన అర్చకులు భాస్కరశాస్త్రి, విష్ణువర్ధన్ శాస్త్రిల ఆధ్వర్యంలో హోమ పూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. పూజలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో శ్రీకృష్ణుడి రథోత్సవాన్ని నిర్వహించారు.

గోనెగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. గోనెగండ్ల, పెద్దనేలటూర్, హెచ్ కైరవాడి తదితర గ్రామాల్లో శ్రీకృష్ణ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పెద్దనేలటూర్ గ్రామంలో కనుల పండువగా రథోత్సవం జరిగింది.

వెల్దుర్తి: మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి గురువారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని పశువుల దేవాలయం ఆవరణలోని శ్రీరుక్మిణీ కృష్ణ అలయంలో శ్రీకృష్ణ జయంతోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. రుక్మిణిసమేత శ్రీకృష్ణుడి ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగించారు. మండల పరిధిలోని పుల్లగుమ్మి గ్రామంలో పురోహితుల జంధ్యాల శశిధర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, ఉట్టి, గ్రామోత్సవం నిర్వహించారు.

మద్దికెర : మండల కేంద్రమైన మద్దికెర, ఎం. అగ్రహారం గ్రామాల్లో గురువారం శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకొని కృష్ణుడి దేవాలయాలలో స్వామి వారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం స్వామి వారి చిత్ర పటాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు.

చిప్పగిరి: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మండంలోని ఆయా గ్రామాలలో రెండు రోజుల పాటు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని నేమకల్లు, నగరడోణ, తదితర గ్రామాలలో శ్రీకృష్ణుని మందిరాల వద్ద గ్రామ ప్రజలు, పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం నేమకల్లు గ్రామంలో శ్రీకృష్ణుని ప్రతిమను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. జెడ్పీటీసీ విరుపాక్షి స్వామివారి పల్లకీ మోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**గోకుల కృష్ణ.. గోపాల కృష్ణ**

ఆలూరు రూరల్: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం మొలగవల్లి గ్రామంలోని కృష్ణాష్టమిని పురస్కరించుకుని గ్రామస్తులు కృష్ణాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామస్తుల సమక్షంలో రథోత్సవాన్ని చేపట్టారు. చిన్నారుల కృష్ణుడి వేషధారణలు ఆకట్టుకున్నాయి. బళ్లారి మాజీ మేయర్ శశికళా కృష్ణమోహన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి..ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

ఆస్పరి: ఆస్పరి మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక భీమలింగేశ్వర స్వామి ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణుడు చిత్రపటానికి అర్చకులు మల్లికార్జున స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగ పూజ నిర్వహించారు. భీమలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉట్లోత్సవంలో యువకులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని గురువారం గ్రామస్తులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, త్రైత సిద్ధాత ప్రబోధ సేవా సమితి–ఇందు జ్ఞాన వేదికల కమిటీ సభ్యులు గ్రామంలో కృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజ కార్యక్రమాలు చేశారు. సాయంత్రం ఆశేష భక్త జనం మధ్య ఊరేగించారు. ఊరేగింపు ముందు కోయిలకొండ గ్రామానికి చెందిన ప్రబోధ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో కోలాటం అందరినీ ఆకర్షించింది.



వెల్దుర్తిలో శ్రీకృష్ణుడి గ్రామోత్సవంలో గోపికల వేషధారణలో చిన్నారుల నృత్య ప్రదర్శన

### నిరాహార దీక్షను జయప్రదం చేయండి

గోనెగండ్ల : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 10న కర్నూలులో చేపట్టే వేడుకోలు నిరాహార దీక్షను జయప్రదం చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు పుల్లన్న, రవి కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు, ఎంటీఎస్ అమలు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ఈపీఎఫ్, డీఏ, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో గోవింద రాజులు, కవిత, స్రవంతి, మంజుల, ఉషారాణి పాల్గొన్నారు.

### కొత్త పింఛన్ల పంపిణీ



కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న హనుమంతు

తుగ్గలి : మండల పరిధిలోని శభాష్‌పురంలో గురువారం కొత్తగా మంజూరైన పింఛన్లను పంచాయతీ కార్యదర్శి ముంతాజ్‌తో కలిసి సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు పంపిణీ చేశారు. సచివాలయ పరిధిలో 15 మందికి పింఛన్లు మంజూరయ్యాయని ఈ సందర్భంగా హనుమంతు తెలిపారు.

### 11 నుంచి మండలస్థాయి క్రీడా పోటీలు

హొళగుంద: స్కూల్ గేమ్స్ ఆఫ్ అథెలెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు ఇంగళదహాల్ జెడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం నజీర్ అహ్మద్, పీడీ మహబూబ్ బాషా తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగంలో ఆసక్తి క్రీడా కారులు ఉదయం 9 గంటలకు సంబంధిత పాఠశాల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకుని ఆటల పోటీల్లో పాల్గొనాలన్నారు.

### పదోన్నతిపై నంద్యాల జిల్లాకు బదిలీ

మద్దికెర : మండల కేంద్రం మద్దికెర పంచాయతీలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శ్రీహరి ఈఓపీఆర్డీగా పదోన్నతి పొందారు. నంద్యాల జిల్లాకు శ్రీహరి బదిలీ అయ్యారని ఎంపీడీఓ నరసింహమూర్తి గురువారం తెలిపారు.

### రైతులకు అందుబాటులో ఎరువులు

హాలహర్వి : రైతులకు అందుబాటులో ఎరువులను ఉంచామని, సద్వినియోగం చేసుకోవాలని ఏఓ శివశంకర్ సూచించారు. ఈ మేరకు గురువారం మండలంలోని బేవినహాల్, కొక్కరచేడు రైతు భరోసా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో కాంప్లెక్స్ ఎరువులు, డీఏపీ, యూరియా అదుబాటులో ఉన్నాయని ఏఓ తెలిపారు. చింతకుంటలో ఉన్న రైతు సహకార సంఘం సొసైటీ సీఈఓను కలిసి కౌలు రైతులందరికీ పంట రుణాలు అందించాలని కోరడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు జయకుమార్, వెంకటేష్, రవి పాల్గొన్నారు.

### క్రీడల్లో సత్తా చాటాలి

కృష్ణగిరి: ప్రతి విద్యార్థి చదవుతోపాటు క్రీడల్లో సత్తాచాటాలని హెచ్ఎం వెంకటరయణయ్య కోరారు. మండల పరిధిలోని అమకతాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సోషల్ ఉపాధ్యాయుడు గిడ్డయ్య క్రీడాకారులకు క్రీడా దుస్తులను గురువారం అందజేశారు. కార్యక్రమంలో పీడీ శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యార్థులు మనోధైర్యాన్ని పెంపొందించుకోవాలి

ఆదోనిఅర్బన్ : విద్యార్థులు మనోధైర్యాన్ని పెంపొందించుకోవాలని ఏరియా ఆస్పత్రి మానసిక వైద్యనిపుణులు డాక్టర్ చైతన్యకుమార్, సైక్రియాటిస్ట్ డాక్టర్ వెంకటసుబ్బయ్య సూచించారు. గురువారం స్థానిక విశ్వనారాయణ కళాశాలలో ఈనెల 10వ తేదీన జరిగే ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైకాలజిస్టు ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకుఅవగాహన సదస్సు నిర్వహించారు. శారీరక బలహీనతలు మానసికంగా దెబ్బతీస్తాయని, పరీక్షల్లో ఫెయిలవ్వడం, ఉద్రేకం, కోపం, చిరాకు అధికమై ఆత్మహత్యలకు పాల్పడతారని చెప్పారు.

## ఓటర్ల సర్వే పకడ్బందీగా చేయండి

- జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి



నందవరంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

గోనెగండ్ల/నందివరం గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల సమగ్ర సర్వేను బీఎల్‌ఓలు పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి నాసర రెడ్డి సూచించారు. గురువారం గోనెగండ్ల ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో, నందవరం తహసీల్దార్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కలిగేలా చూడాలన్నారు. ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను గుర్తించి సమగ్రంగా విచారించాలన్నారు. అలాగే వందేళ్లు నిండిన వారిని గుర్తించడం, డోర్ నంబర్ లేకుండా ఒకే నెంబర్‌పై ఉన్న ఓట్లు పరిశీలించాలని తెలిపారు. సర్వీసు ఓటర్లు, ఎన్ఆర్ఐ ఓటర్ల వివరాలు సరిచేయడం, దీర్ఘకాలంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓట్లను వారి ఇష్టం మేరకు జాబితాలో నుంచి తొలగించాలి. ఈ ప్రక్రియ ఈనెల 15వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. ఓటరు సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గోనెగండ్ల తహసీల్దార్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్, సూపరింటెండెంట్ బాబు భాస్కర్, నందవరం తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య, టీడీ రఘువీర తదితరులు పాల్గొన్నారు.

**ఓటర్ జాబితా సవరణకు అందరు సహకరించాలి**

కృష్ణగిరి: ఓటర్ జాబితా సవరణకు అందరు సహకరించాలని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితా సవరణపై ఇంటింటా తిరిగి బీఎల్‌ఓల ద్వారా డెత్, డబుల్ ఎంట్రీ తదితర వాటిని గుర్తించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రెండు మండలాల తహసీల్దార్లు రాజేశ్వరి, శివరాముడు నాయకులు పాల్గొన్నారు.

## పిల్లలు బడిలోనే ఉండేలా చూడాలి



అధికారులతో సమావేశమైన స్పెషల్ ఆఫీసర్ రామాంజనేయులు

హాలహర్వి : 14 సంవత్సరాల్లోపు పిల్లలందరూ బడిలోనే ఉండాలని మండల స్పెషల్ ఆఫీసర్ రామాంజనేయులు ఆదేశించారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓలు, ఎంపీడీఓతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ వలంటీర్లు జీఈఆర్ సర్వేను వంద శాతం పూర్తి చేయాలన్నారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు అన్నిశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొక్కరచేడు, చింతకుంట, బిలేహాల్, విరుపాపురం, గూళ్యం, బేవినహాల్ గ్రామాల్లో జీఈఆర్ సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంథోని, విద్యాశాఖ అధికారులు ఈరన్న, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పంట నమోదు పరిశీలన



పంట నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏఓ

వెల్దుర్తి: మండల పరిధిలోని చెరుకలపాడు, కొసనాపల్లె గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను గురువారం ఏఓ అక్బర్‌బాషాతో కలిసి తహసీల్దార్ శివరాముడు పరిశీలించారు. సాగు చేసి ప్రతి పంటను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఈ సందర్భంగా తహసీల్దార్ ఆర్బీకే సిబ్బందికి సూచించారు. కౌలు, ఇనాం, దేవదాయ, వక్ఫ్ భూములు తదితరాలకు సంబంధించి యాజమాన్యం హక్కు పత్రాలు పొంది సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేయాలన్నారు. మండల కేంద్రం వెల్దుర్తిలోని విత్తనాలు, ఎరువుల, పురుగు మందుల దుకాణాలను ఏఓ తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు, స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా అమ్మకాలు జరపాలని దుకాణదారులను ఆదేశించారు.

## రోడ్డు ప్రమాదంలో 8 మంది కూలీలకు గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం





తీవ్రంగా గాయపడ్డ వెంకటేశ్వరమ్మ, కర్ణ



దెబ్బతిన్న ఆటో



గాయపడిన సంతోషమ్మ

ఆస్పరి: మండల కేంద్రమైన ఆస్పరి సమీపంలో గురువారం రెండు ఆటోలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కూలీలకు గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆస్పరి, జొహరాపురం గ్రామాలకు చెందిన 20 మందికిపైగా వ్యవసాయ కూలీలు దేవనకొండ మండలం గద్దెరాళ్ల గ్రామ సమీపంలో పొలం పనులకు ఆటోలో వెళ్తున్నారు. ఆస్పరి సమీపంలో బిల్లెకల్ గ్రామం నుంచి ఆస్పరి వైపు వస్తున్న ఆటో.. వ్యవసాయ కూలీల ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆస్పరికి చెందిన వెంకటేశ్వరమ్మ, లక్ష్మి, జొహరాపురం గ్రామానికి చెందిన సంతోషమ్మ, కర్ణ, నారాయణమ్మ, ఎర్రన్న అంజినమ్మ, పులికొండమ్మకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరమ్మను మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ విలేకరులకు తెలిపారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దకడబూరు: మండలంలోచి ముచ్చుగిరి ఫారెస్ట్ పరిధిలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు కోసిగి సర్కిల్ సెబ్ సీఐ సృజన్ బాబు తెలిపారు. గురువారం సెబ్ పోలీసులతో కలిసి ముచ్చుగిరి ఫారెస్ట్‌లో తనిఖీ చేస్తుండగా కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన చెన్నబసవ కారు, బైక్‌లో మద్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 35 బాక్స్‌ల్లో 90 ఎంఎల్ ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు పట్టుబడ్డాయన్నారు. మద్యం తరలించేందుకు ఉపయోగించిన ఇండికా కారు, బైక్‌ను సీజ్ చేశామన్నా రు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు.

ఆదోనిరూరల్ : పట్టణంలోని అమరావతినగర్‌లో బోయ కాసమ్మ అనే మహిళ 22 కర్ణాటక మద్యం ప్యాకెట్లు కలిగి ఉండడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ సీఐ హరికృష్ణ గురువారం తెలిపారు.